క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న ఎంపీపీ పోరెడ్డి అరుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చందన సోమవారం తెలిపారు. సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

పొదిలి ఎస్‌ఈబీ సీఐగా ఈశ్వరయ్య


ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

పొదిలి రూరల్: పొదిలి ఎస్‌ఈబీ సీఐగా బి.ఈశ్వరయ్య నియమితులయ్యారు. పల్నాడు జిల్లా ఈపూరులో పనిచేస్తున్న ఆయనను పొదిలిలో నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎస్‌ఈబీ ఎస్సైగా పల్నాడు జిల్లా ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని నియమించగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పోగొట్టుకున్న బైక్ అప్పగింత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రేడియోబావి సమీపంలో పట్టణానికి చెందిన బాలీశ్వరయ్య అనే వ్యక్తి తన బైక్ పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు స్థానిక ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకుని బాధితుడి బైక్‌ను సీసీ కెమెరాల ఆధారం కనుగొని బాధితుడికి సోమవారం అప్పగించాడు. పట్టణంలోని బైక్‌లను దొంగలించే వ్యక్తులు సంచరిస్తున్నట్లు ప్రజలు అప్రమత్తంగా మెలగాలన్నారు. బైక్‌లకు తప్పకుండా తాళాలు వేయాల్సిందిగా ఆయన కోరారు.

రహమతున్నిసాకు డాక్టరేట్


రహమతున్నిసా

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న షేక్ రహమతున్నిసా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ ఎ.పత్రిక్ ఆధ్వర్యంలో జీవిత బీమా కంపెనీల మార్కెటింగ్ వ్యూహాలపై ఆమె అధ్యాయనం చేశారని ఆయన పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన రహమతున్నిసాను ప్రిన్సిపాల్‌తో పాటు తోటి అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి గాయాలు

ముండ్లమూరు: స్థానిక ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న కంచర్ల వెంకటరావుకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వెంకటరావు మండలంలోని తూర్పు కంభంపాడు గ్రామం నుంచి ముండ్లమూరు బ్యాంకుకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మార్గంమధ్యలో శంకరాపురం వద్ద ఆయిల్ ట్యాంకర్ నుంచి కారిని ఆయిల్ రోడ్డుపై పడటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కాలికి, చేతులకు గాయాలయ్యాయి. తలకు హెల్మెట్ ఉండటంతో పెను ప్రమాదం నుంచి బయట పడ్డారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి చెంచిరెడ్డి, బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మార్కాపురం తాలుకా యూనిట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి బడే సాహెబ్, యూనియన్ నాయకులు నేతాజి, కోమలి, హేమలత, నాయబ్ రసూల్, మహమ్మద్, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి

దర్శి: విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని రాజంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.చంద్రమోహన్ అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులచే జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం జరిగింది. గ్రామ సచివాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చంద్రమోహన్ మాట్లాడుతూ క్విజ్ పోటీల ద్వారా పిల్లల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. పోటీల నిర్వాహకులను అభినందించారు. కె.శ్రీనివాస్, ఎన్‌వీపీ కుమార్, ఎస్.లక్ష్మీగాయత్రి పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్ద ధాన్యం కొనుగోలు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు బ్రోచర్‌ను సోమవారం రైతులకు అందజేశారు.

అంతా రామమయం


మార్కాపురంలో పూజలందుకుంటున్న సీతారాములు


మార్కాపురం శివాలయంలో దీపాలంకరణ


బేస్తవారిపేట: స్వామివారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర


కొమరోలు: బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

- ఊరూవాడా రామాలయాల్లో ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ట సందర్భంగా ఊరూవాడా జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. పల్లెలు, పట్టణాల్లో భక్తి భావం వెల్లివిరిసింది. సోమవారం మార్కాపురం నియోజకవర్గంలోని ప్రతి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు చోట్ల అన్నాసంతర్పణ చేశారు. మార్కాపురం పట్టణంలోని ప్రసన్న రామాలయం, కోదండ రామాలయం, నాగులపుట్ట వీరాంజనేయ స్వామి, ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయల్లో పూజలు, కళ్యాణోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో శ్రీరాముని శోభయాత్ర వైభవంగా సాగింది. పట్టణంలోని నాలుగు మాఢ వీధుల్లో నిర్వహించిన శోభాయాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సాయిబాబా మందిరంలో హరిహరరావు ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వర స్వామి(శివాలయం) ఆలయంలో సోమవారం రాత్రి సహస్ర దీపాలంకరణ చేశారు. స్వామివారి గర్భ గుడి, ఆలయ పరిసరాలను దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వేద అధ్యయనం చేశారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో రాములోరి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు కోలాటం ప్రదర్శించారు. నాయుడుపేట, బురదపాలెం గ్రామాలలో అన్నసంతర్పణ చేశారు.

పొదిలి రూరల్: పొదిలిలో సీతారామ చంద్రమూర్తుల శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి హారతులిచ్చి స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు శోభయాత్రలో పాల్గొన్నారు. అమ్మవారిశాలలో రాములోరి కళ్యాణం నిర్వహించి, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

తర్లుపాడు: తర్లుపాడులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామ భక్తులు శ్రీరాముని చిత్రపటాలు చేతబూని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. యువకులు జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గిద్దలూరు రూరల్: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం, పట్టాభిరామస్వామి ఆలయం, సీతారామస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి ఆలయంలో బాలరాముడి చిత్రపటం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. సాయిబాబా ఆలయంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఎల్‌ఈడీ టీవీలో వీక్షింపజేశారు. హిందువుల చిరకాల కోరిక నెరవేరుతున్న రోజును ఎప్పటికి మరువలేమని భక్తిభావంతో పూజలు చేశారు. అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షురాలు అనసూయా, గిద్దలూరు నియోజకవర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రారెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, రామాంజనేయులు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కంభం..

పట్టణంలోని దేవాలయల కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు వీధుల్లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. శ్రీరాముడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపు కొనసాగించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. 500 సంవత్సరాల కల నెరవేరిందంటూ హిందువులు ఆనందాన్ని వెల్లబుచ్చారు.

కొమరోలు: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట చేసిన సందర్భంగా మండల వ్యాప్తంగా రాముల వారి దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కొమరోలులోని పట్టాభిరామస్వామి దేవాలయంలో సీతారామస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేసి బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులకు వీక్షింప చేశారు. అక్కపల్లెలో రాములవారి గ్రామోత్సవం నిర్వహించారు. పొట్టిరెడ్డిపల్లె ఎంపీపీ పాఠశాలలో టీవీ ద్వారా విద్యార్థులకు బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పిల్లలకు చూపించారు.

బేస్తవారిపేట: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా రామాలయ కమిటీ నిర్వాహకులు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభా యాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. తేరు బజార్‌లోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. బాణసంచా, టపాసులు కాల్చుతూ, డీజే, కనక తప్పెట్లు, చిన్నారుల కోలాటంతో వైభవంగా శోభా యాత్రకొనసాగింది. మహిళలు దీపాలు వెలిగిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామాలయం వద్ద అన్నదానం చేశారు.

పెద్దదోర్నాల: రామ నామస్మరణతో మండల కేంద్రం మార్మోగింది. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రం భక్తులతో కిటకిట లాడింది. మండల పరిధిలోని రాముల వారి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఆలయాల ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య అర్చకుల వేదమంత్రాల నడుమ శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ అర్చకులు బి.రామ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు పానకం, వడపప్పులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భారీ అన్నదానం చేశారు.

పెద్దారవీడు: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో రామాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మద్దలకట్టలో అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నైవేద్యం తయారు చేసి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామాల్లో భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

యర్రగొండపాలెం: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పట్టణంలోని పలుప్రాంతాల్లో శ్రీరామచంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రామాలయం, ఎస్‌బీఐ బ్యాంకు, మార్కాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

దొనకొండ: అయోధ్యలో బాల రాముని నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా స్థానిక విరాట్ నగర్ ఆనంద ఆశ్రమం నుంచి భైరవానంద స్వామి నేతృత్వంలో ఘనంగా వైభవంగా శోభాయాత్ర సోమవారం జరిగింది. మల్లెలవారిపేట రామాలయం, అరబస్తాన్ భక్తాంజనేయ స్వామి దేవాలయం, బ్రహ్మరావుపేట శ్రీ పట్టాభి రామచంద్రా దేవాలయం, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయం, పోలేరమ్మ దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, గుట్టమీదపల్లి సీతారామాలయం, రైల్వే క్వాటర్స్‌లోని పోలేరమ్మ, సీతారామ చిన్న స్వామి దేవాలయాల్లోని ధర్మకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ చేశారు. అన్ని ఆలయాల ధర్మకర్తలు, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి శోభాయాత్రలో పాల్గొన్నారు. భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన అంకాల మల్లికార్జున అన్నదానం చేశారు.

ముండ్లమూరు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాలకు అయోధ్య నుంచి అక్షతలు చేరడంతో గ్రామాల్లోని హిందుత్వ కుటుంబాలకు ఆలయాల పూజారులు ప్రత్యేక పూజల అనంతరం అందజేశారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. మండలంలోని పసుపుగల్లు, వేముల, ముండ్లమూరు, వేంపాడు, పులిపాడు, ఉమామహేశ్వరపురం, మారెళ్ల, నాయుడుపాలెం, పులిపాడు గ్రామాల్లో భక్తులు రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు దర్భాకుల నగేష్‌శర్మ, రాధాకృష్ణ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పొట్లపాడులో వేంచేసి ఉన్న రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం హనుమత్ వాహనంపై విగ్రహ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఆలయ పూజారులు ప్రసాదాచార్యులు, మారుతిచార్యులు, రంగాచార్యులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గ్రామంలో పంపిణీ చేశారు.

శ్రీరాముని దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: బూచేపల్లి


ఎల్‌ఈడీలో బాలరాముని ప్రతిష్టను తిలకిస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: శ్రీరాముని దయతో నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రైతుల పంటలు బాగా పండాలని, వ్యాపారాలు దినదిన భివృద్ధి చెందాలని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ సందర్భంగా బూచేపల్లి నివాసంలో శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్తరెడ్డిపాలెం రామాలయం, గాంధీనగర్‌లోని కోదండరామాలయం, కొత్తపాలెంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హాజరైన శివప్రసాద్‌రెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కొత్తపాలెంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రామాలయం ప్రతిష్ఠ మహోత్సవాలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో బూచేపల్లి పాల్గొన్నారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కౌన్సిలర్‌లు ఆవుల జ్యోతి శివారెడ్డి, మేడం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ యరమల మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, గంజి వెంకటేశ్వర రెడ్డి, కిక్కురు రమణారెడ్డి, మేడగం పుల్లారెడ్డి, కుందురు నరశింహారెడ్డి, శ్రీలం శ్రీనివాసరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి పాల్గొన్నారు.


దొనకొండ: శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందువులు


గిద్దలూరు: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పెద్దదోర్నాల: విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


పెద్దారవీడు: ప్రత్యేక అలంకారంలో శ్రీరామచంద్రమూర్తి


కురిచేడు: విద్యుద్దీపాలతో వెలుగుతున్న రామాలయం


మార్కాపురంలో రాముని చిత్రపటంతో మహిళల ప్రదర్శన


గొట్లగట్టు రామాలయంలో భక్తుల సందడి


తర్లుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు


ముండ్లమూరు: పసుపుగల్లు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


యర్రగొండపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

వైఎస్సార్ ఆసరా విజయవంతంగా నిర్వహించాలి


వెంకాయమ్మను సత్కరిస్తున్న అధికారులు

దర్శి: ఈ నెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక బూచేపల్లి నివాసంలో ఎంపీడీఓ, ఏపీఎం, సీసీలతో వారు సోమవారం సమావేశమయ్యారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. మూడు విడతలు పూర్తి చేసుకుని నాలుగో విడత రుణమాఫీని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నేడు నగదు డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు ఎంపీడీఓలు హనుమంతరావు, కుసుమకుమారి, యుగకీర్తి, శంకరరావు, ఏపీఎంలు విజయకుమారి, గుడిమెట్ల వెంకటేశ్వర్లు, దేవరాజు, హనుమంతరావు, సీసీలు బ్రహ్మయ్య, ఫణిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కాపురం నియోజకవర్గ ఓటర్లు 2,12,070

- సబ్ కలెక్టర్ రాహుల్ మీనా వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా విడుదల చేశారు. మొత్తం ఓటర్లు 2,12,070 మంది కాగా, ఇందులో పురుషులు 1,06,777, మహిళలు 1,05,288, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారని వివరించారు. మార్కాపురం రూరల్ 41,207 మంది, పట్టణంలో 55,305, తర్లుపాడులో 25,936, కొనకనమిట్లలో 38,072, పొదిలి మండలంలో 22,283, పొదిలి పట్టణంలో 29,267 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచామన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే చర్యలు


తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో వివిధ వ్యాపార సంస్థలు, మాల్స్, కిరాణా, ఫ్యాన్సీ షాపులు నిర్వహిస్తున్న వారు ట్రేడ్ లైసెన్స్ పొందాలని, లేని వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని వివిధ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి లైసెన్స్‌ను పరిశీలించారు. లేని వారు సచివాలయాల్లో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన వస్తువులను అమ్మినవారిపై, 120 మైక్రాన్ మందం కంటే తక్కువ కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. షాపుల ముందు కాలువల్లో చెత్తా చెదారం వేయవద్దని, పారిశుధ్య కార్మికులకు సహకరించాలని చెప్పారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం టౌన్: స్పందన అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మార్కాపురం మండలం వేములకోటకు చెందిన తిరుమలరెడ్డి రామిరెడ్డి తాను గత ఆగస్టులో పట్టణంలో చింతకుంటలో ఒక ప్రైవేటు దుకాణంలో మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేయగా కాయలు రాలేదని, న్యాయం చేయాలని కోరారు అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ నేత గాలి వెంకటరామిరెడ్డి అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

- ఆర్టీవో అమర్ నాయక్


మాట్లాడుతున్న ఆర్టీవో అమర్ నాయక్

మార్కాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని మార్కాపురం ప్రాంతీయ రవాణా అధికారి అమర్ నాయక్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తు వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్స్‌ను కలిగి ఉండాలని, హెల్మెట్, సీటు బెల్ట్‌ను ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఇటీవల ప్రమాదాలను పరిశీలిస్తే చాలా మంది ఫోన్ మాట్లాడతూ డ్రైవింగ్ చేయడమే ప్రధాన కారణంగా తేలిందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి రామసుబ్బయ్య

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాలు పరిశీలించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి రామసుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బందికి, రాజకీయ పార్టీల నాయకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్వహించిన ఓటర్ల జాబితాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేశామని, వాటిని పరిశీలించుకుని ఏవైన తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు అధికారులను సంప్రందించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తహసీల్దార్లు డి.సీతారామయ్య, వరకుమార్, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఎలక్షన్ డీటీ భారతీభాయ్, రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.